# ఒక హరిజనుని కథ

కూచి నరసింహము

### పీఠిక

ఇది (వారమునకు రెండుసార్లు ప్రకటింపఁబడు) ౩౦-౮-౩౧ తేదీ ఆదివారపు అమృతబజారుపత్రికలో నున్నది. దాని నాంగ్లమున వ్రాసినవారు ఎస్. ఎమ్. చక్రవర్తి, ఎమ్. ఏ., గారు. కథానాయికా నాయకుల నామములఁ బట్టియు, కథాసందర్భమును బట్టియు నది వంగదేశపు సత్యవృత్తాంతముగాఁ దోఁచుచున్నది. ఎక్కడిదైననేమి? దయాప్రేమములే పరమధర్మములు, ప్రతిమతమునకును ప్రాణములు, పరమేశ్వరప్రీతికరములు అను గొప్పనీతి నిదర్శనముగాఁ, జక్కఁగా నది బోధించుచున్నది. నాటకము నంకములుగా విభజించునట్లు చక్రవర్తిగారు విషయవిభజనముచేసి యీకథ నాలుభాగములుగా వ్రాసినారు. ఆంగ్లభాషాపరిచయము లేని యాంధ్రసోదరసోదరీమణుల కొఱకు నేను దాని నాంధ్రీకరించి ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచికకుఁ బంపుచున్నాను.

కూ. న.

### ౧

ఆ రోజు సంతరోజు. పల్లెటూళ్లలోనుండు పరమదరిద్రులకు సంతరోజు చాల భయావహమైనరోజు. ఆభయము వారికి వారము పొడుగునను నుండును. ఎందుచేత? ఆరోజున వారమునకు సరిపడు బియ్యము, పప్పుగింజలు, ఉప్పు, నూనె మున్నగు జీవనాధారపదార్థము లన్నియు వారు కొనితెచ్చుకొనవలెను; అప్పులిచ్చిన యయ్యల బాకీలు తీర్చుకొనవలెను; లేదా వారి నెట్లో సమాధానపఱచుకొనవలెను.

మన కథానాయకుఁడగు రామచరన్నకు, పాపము, ఆవారమంతయు దురదృష్టపువారమే యైపోయినది. చలపట్టి కట్టుగట్టినట్టు చేఁపలేవియు నతనివలలోఁ బడక దూరముగానుండిపోయినవి. ఆవారములో రాబడి యొక్కపైసయైనను చేతికి రాలేదు. దినముకూడ తీక్ష్ణముగా నుండెను. ఉదయభాస్కరుఁడే మధ్యందినమార్తాండునివలె మండిపడుచుండెను. రామచరణ్ భార్యయగు "ములవి" పెనిమిటికిచ్చుటకు చేఁపలవల పైకిఁ దెచ్చి "ఇటువంటి గడ్డువేఁడిగాయురోజున మీరు చేఁపలు పట్టుటకుఁ బైకిఁబోవుట నా కెంతమాత్రమును ఇష్టముగా లేదు. కాని అయ్యో! చాలినన్ని చేఁపలు నేఁడు వలలోఁ బడినఁగాని కూటికి ఉప్పును, బియ్యమును అయినను గుడిసెలో నుండవు. ఏమి చేయుదము?" అని పలికెను.

రా—అవునే! ఆసంగతి నాకుఁ దెలియును. నారాయణుఁడేమి చేయఁదలఁచుకొన్నాఁడో చూతము! మనము పస్తుండవలెననియే ఆయన నిశ్చయించుకొనునెడల మన మట్లుండక తీఱదు. మఱేమి చేయఁగలము?

దు—కూటిమాట సరేలెండి, అన్నముకంటెను అత్యావశ్యకమైన సంగతి, అంతకంటెను తొందరపని యింకొకటి యున్నది. సెలవైనయెడలఁ జెప్పెదను.

రా—అది యేది?

దు—నిరుడు తీవ్రమైన జ్వరముచే మీకు ప్రాణమిూఁదికి వచ్చినప్పుడు ఖాయిలా నిమ్మళించి మీరు బ్రతికినయెడల నారాయణస్వామివారి కొక యరఁటిపండ్లగెల యిచ్చెదనని నేను మ్రొక్కుకొన్న సంగతి మీకు జ్ఞప్తిలో నుండవచ్చును. ఆయన మిమ్ము బ్రతికించి మీకు మరల ఆరోగ్యమిచ్చినారు కాని, మ్రొక్కుమాత్ర మింకను ఆమట్టుననే యున్నది. నిన్నరాత్రి నాకొక కలవచ్చినది. అది నామనస్సును మిక్కిలియుఁ గలవరపెట్టుచున్నది. తళతళలాడు తెల్లని జందెము వేసికొని పొడుగుబ్రాహ్మణుఁ డొకఁడు నాతలాఁపి కడకు వచ్చినిలఁబడి "నీవిచ్చెదనన్న యరఁటిగెల యింకను ఈయలేదేమి?" యని నన్ను గద్దించి యడిగి, యిచ్చినమాట త్వరగా నిలుపుకొనిచో నాకుఁ దగిన శాస్తి చేసెదనని బెదరించి వెళ్లిపోయెను. మ్రొక్కుదీర్చుకొనుటకు వారమంతయు నేను తిండిమాని పస్తుండ సిద్ధపడియున్నాను.

రా—నిండుగెల యిచ్చెదనని నీవు వట్టియవివేకపు మ్రొక్కు మ్రొక్కుకొంటివి. అయిదుపండ్లిచ్చెదననవచ్చును. లేదా చివరకుఁ బదిపండ్లిచ్చెద ననవచ్చును. గాని గెలకుగెలయిత్తుననుట తెలివి

తక్కువ గాక మరేమి? అంతపెద్ద మ్రొక్కును మనమెట్లు తీర్చుకొనగలమో నిజముగా నాకుఁ దెలియకున్నది. ఈ చౌకరోజులలో నైనను గల రెనిమిడణాలు పెట్టినఁగాని రాదు.

దు.— ఏమి చేయుదువన్నారు? గెలవకేం కాదు, అప్పుడు మ్రొక్కుబడిగా నా ప్రాణములు సైతము అర్పింప సంసిద్ధురాలనై యుంటిని. అప్పటి నాయీదుర్గా యట్టిది (అని కొంచెము నేపాఁగి) ఔనులెండి! మన ప్రస్తుత దుస్థితిలో అరఁటిపండ్ల మ్రొక్కు చెల్లించుకొనుటకంటెఁ బ్రాణ మిచ్చు ప్రతిజ్ఞ నెరవేర్చుకొనుటయే సుకరతరమని నే నొప్పుకొనుచున్నాను. అది నే నెఱుఁగుదును.

రా.— (ఆమాటల కెంతో సంతాపపడి భార్య నోదార్చు నుద్దేశముతో) అయిన నేమిలే! భయపడకు. తన యరఁటిపండ్లు తనకుఁ గావలయునని నారాయణునకు కోపేక్ష యున్నయెడల, వాఁడే నాకు నేఁడు చేపలు పుష్కలముగా దొరకునట్లు చేయును.



"ఓసీ! యీసారి మనకెన్ని చేపలు దొరకినవో చూడు!"

అనిచెప్పి రామచరణ్ వలయును, బుట్టలును పట్టుకొని యిల్లు విడిచిపోయెను.

## ౨

నారాయణస్వామి యాయూరివారి కందఱకును ఇష్టదేవత, కులదైవతము. గట్టిగా నిటికలతోఁ గట్టిన ఆయనగుడి యూరిపొలిమేర నున్నది. అది కట్టి రమారమి రెండువందల సంవత్సరములు గావచ్చినది. కష్టములు వచ్చినప్పుడా గ్రామమువారేకాక చుట్టుపట్లనున్న యూళ్లవారును, అప్పుడప్పుడు మారుగ్రామస్థులును గూడ నారాయణస్వామినే నమ్మికొని యివి యిచ్చెదమనియు, అవి యిచ్చెదమనియు నానావిధములైన మ్రొక్కులును మ్రొక్కుకొనుచుందురు. ఆయనయనుగ్రహమువలన నందుచే ననేకులకు వ్యాధులు నివృత్తించినవి. గొడ్రాండ్రు బిడ్డలతల్లులైనారు. భార్యలను బాధు భర్తలు భార్యల కిష్టులగు పతులైనారు. గ్రామస్థుల కందఱకును స్వామిపై గాఢమైన విశ్వాసము గలిగినది; యథావిధిగా మ్రొక్కుకొనినయెడల నెట్టి కార్యమైనప్పటికిని అమోఘముగా నెఱవేఱును నను నమ్మకము వారి మనసులలో గట్టిగా నాటుకొనినది. పూర్వపు జమీందారు, కోవెలగ్రామము గొప్పగ్రామము చేయుటకై సమీపమున నొక బజారును, టపాకచేరీయును, ఒకటి రెండు దుకాణములను బెట్టింప నుద్దేశించి, గుడికి చేరువగా, యావద్వ్యయభారమును తానే వహించి, గ్రామోపయోగార్థము : విష్ణు

తరగతుల పాఠశాల యొకటి గట్టిది కట్టించి పెట్టినాఁడు: కాని తక్కిన తనసంకల్పములు నెఱవేఱకముందే, ప్రజాదురదృష్టవశమున, ఆయన మరణించినాఁడు. తదనంతరపు జమీందారు (౧౯౨౦ ఆ ప్రాంతమున పడుచువాఁడుగానే యుండెను) కలకత్తాలో స్థిరనివాస మేర్పఱుచుకొని యెప్పుడోకాని యింటికి రాఁడు.

సాయంకాలము రమారమి మూఁడుగంటలకు రామచరణ్ ఇంటికి వచ్చినాఁడు; ఈమాటు చేఁపలబుట్టల బరు వెక్కువగా నున్నదని యతని నడకతీరుచూచిన ప్రతివాఁడును దెలిసికొనఁగలఁడు. ఇంటిముంగలనే యిల్లాలిని జూచి యతఁ డామెతో నిట్లు పల్కెను:

రా:—ఓసీ! యీసారి మనకెన్ని చేఁపలుదొరకినవో చూడు! ఇదంతయు నారాయణమూర్తి కృపయే! ఆయనచేసిన పనియే! అది నే నెఱుఁగుదును. ఈకాలమునఁగూడ వేల్పులున్నారు, కాని పాపాత్ములమగు మనము వారిని చూడలేము.

డులలి ఆఁపుకొనలేని ఆనందబాష్పములతో "ఔను! ఈకాలమునఁ గూడ వేల్పులున్నారు. కాని పాపాత్ములమగు మనము వారిని జూడలేము" అని మగనిమాటలే నొక్కి మరలఁ బల్కెను.

పచ్చిమిరపకాయ లుప్పులో నద్దుకొని నంజుకొనుచు రామచరణ్ తొందరతొందరగా నన్నము దిని యూరికి మూఁడుమైళ్ల దూరమున సాగుచున్న సంతకు బయలుదేఱిపోయెను. అతఁడు వెళ్లు త్రోవలోనే నారాయణాలయ మున్నది. ఆలయసమీపమునకు రాఁగానే రామచరణ్ చేఁపలబుట్టలు క్రిందఁబెట్టి, మూసియున్న గుడితలుపులమ్రోల మోఁకరిల్లి నమస్కరించెను. పగటి పూజయు, రాత్రిపూజయుఁ జేయుటకు నుదయమున నొకసారియు, రాత్రిపడిన తరువాత నొకసారియు అర్చకుఁ డాలయమునకు వచ్చి పూజలుచేసి వెళ్లుచుండును. తాను లేనప్పుడు పైజాతిహిందువులలో నెవరైనను వసారామీఁదికి వచ్చి తలుపులు తెఱచి స్వామిని దర్శించిపోవుటకు వీలుగా పూజారి పగటిపూఁట తలుపులకుపైని గొండ్లెమమాత్రము తగిలించి పోవుచుండును. రాత్రి పూజజేసి వెళ్లునప్పుడు కప్పతాళము కూడ వేసి పోవుచుండును. రామచరణ్ అస్పృశ్యుఁడు, వసారా యెక్కఁగూడదు. కనుక "స్వామీ! యీరోజున నీవు నాపై నెంతో కృపచూపినావు. రేపుదయముననే తప్పకుండ నీ యరఁటిపండ్లగెల నీకు నేను సమర్పించుకొనెదను. రక్షింపుము" అని కృతజ్ఞతాభక్తిభరితమైన తన హృదయమును తండ్రికినెలార్చి, వసారాక్రిందనుండియే వంగి నమస్కరించి వెడలిపోయెను.

## ౩

ఊరుదాఁటి రామచరణ్ పొలములమీఁది దగ్గఱత్రోవద్రొక్కి సంతకుఁ బరుగెత్తిపోయినాఁడు. ఆరో జతనియదృష్టపురోజు. చేఁపలమ్మినడబ్బు చాలగా వచ్చినది. విక్రయధనముతో మొదటఁ గొన్న వస్తువు అరఁటిగెలయని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. తరువాతఁ గావలసిన బియ్యము, ఉప్పు, పప్పు మున్నగు పదార్థములు కొనినాఁడు. వానితోపాటు అప్పుడప్పుడు సంతోషసమయములందు భోగభోజన పదార్థముగా నుపయోగించుకొను కొంచెము బెల్లపుపాకము కొన్నాఁడు. ఇవిగాక యతిజాగ్రత్తతో కొంతసొమ్ము మిగిల్చి దానితో పెండ్లాము దండచేతికిఁ గట్టుకొను తాయెత్తుల కుపయోగించు నొక చక్కనిబొందు కొన్నాఁడు. డులలి సందిటి తాయెత్తుల బొందు పాఁతగిల్లి చివికిపోయినది. రామచరన్ కొన్నాళ్లనుండి యది కనిపట్టి చూచుచునే యున్నాఁడు. కాని చేతిలో గవ్వయైనను లేకుండుటచే క్రొత్తబొం దింతవఱకుఁ గొనలేకపోయినాఁడు. ఒక కానిపెట్టి యిప్పుడొక బొందుకొని యది మొలలో దోఁపుకొన్నాఁడు. నారాయణస్వామితర్వాత రామచరన్నకుఁ గృతజ్ఞతాపాత్రమైన ప్రియతమపదార్థము డులలియే! ఎందుచేత? దేవునకు మ్రొక్కుకొని యామె తనప్రాణమును రక్షించినది. ఆమ్రొక్కు వలననే నారాయణమూర్తి స్వయముగా వచ్చి యామెకు స్వప్నములోఁ గనఁబడినాఁడు.

సూర్యాస్తమయము కావచ్చినది. సంతకు వచ్చిన తోడి తనయూరివా రింకను క్రయవిక్రయ వ్యాపారములు ముగించుకొనలేదు. ఎప్పు డింటికి వెళ్లుదునా యని రామచరణ్ తొందరపడుచున్నాఁడు. అతని మనసులో ననేకమైన యూహ లూరి వెల్లివిరియుచున్నవి. క్రొత్తబొందుసంగతి డబ్బాటుగా డులలికిఁ దాఁజెప్పుటతోడనే యమితానందముతోఁ దన్నుఁ జూచు నామె కంటి నిగనిగలు, కలకలలాడు నామెమొగము, మొలకనవ్వులు — ఇవన్నియుఁ దనమనోనేత్రమునకుఁ గాన్పించుచున్నవి. "నేను వెళ్లినవెంటనే పాఁతబొందు త్రెంచిపాఱవైచి తాయెతులు క్రొత్త బొందునకు గ్రుచ్చి స్వయముగా నాచేతులతో నవి నాప్రియురాలి సందిటను గట్టెదను. అంతట డులలి నాపాదధూళితీసికొని తాను బొట్టుపెట్టుకొనుటకై నాముంగల వంగును. వంగియున్న యామె శిరముపై నాచేతులిడి నిమురుచు నే నామెను హృదయపూర్వకముగాఁ బూర్ణానురాగముతో నాశీర్వదింతును" అని యవశమనస్కుఁడై యేమేమో తలపోసికొనుచు రామచరణ్ సంతలో నిఁక నొకనిమిషమైనను నిలువఁజాలక తన యూరివారు తోడరాకుండఁగనే యింటికి మరలిపోయెను.

## ౪

ఊరు చూపుమేరదూరమున నుండఁగా వాయవ్యదిక్కున ఆకాశమంతయు కారుమబ్బు క్రమ్మియుండుట రామచరన్నకుఁ గానిపించెను. ఆవులు కొన్ని యఱచుచు గ్రామమువైపునకుఁ బరుగులిడుచుండెను. రామచరణ్ త్వరగా నడవఁజొచ్చెను. కొంతదూర మరిగినపిమ్మట నేదోయొక భూతము జుట్టుపట్టుకొని తన్ను నేలపైఁ బడవైచి యీడ్చుచున్నట్టు అతనికిఁ దోఁచెను. తటిత్కాంతులేం

తనకు కాలిత్రివ్వటేలు పట్టుబంట్లుగా, నుఱుములే తనబిరుదతూర్య ధ్వనులుగా, నొక పెద్ద దయ్యపుగాలి వచ్చి పొలములపై ఘోరముగా విసరికొట్టుచుండెను. దానితో ప్రబలమైన వర్షముకూడ వచ్చి రామచరన్నును నల్దెసలఁ జుట్టుకొని ముట్టడించెను. అతఁడంతట యావచ్ఛక్తితోను పరుగిడ నారంభించెను. ఎడమప్రక్క నొక గొప్ప మఱ్ఱిచెట్టుండెను. అది రమారమి నూఱేండ్లనుండి వర్షాతప బాధలు తగులకుండఁ జేయుచు ఆలకాపరి బాలురకును, అధ్వగులకును అమోఘ రక్షకస్థానముగా నుండెను. రామచరణ్ ఆచెట్టుకడకుఁ బరుగెత్తినాఁడు. హఠాత్తుగాఁ బిడుగుపడినంత పెద్దధ్వని యొకటి వినఁబడినది. ఉత్తరక్షణముననే తళుక్కుమని యొక మెఱుపు మెఱసి పాపమా బహూపకారియగు మహావటవృక్షము నేలపైఁగూలుట యతని కంటి కగపడినది. నారాయణస్వామియాలయపు టావరణములో నొక పెద్దమామిడిచెట్టు గలదు. రామచరణ్ అటకుఁ బోఁజూచినాఁడు. కాని అదియు తెల్లుముక్కలవలె నిటునటు నూఁగాడుచుండెను. అక్కడకేగుటకూడ నతని కంత క్షేమకరముగాఁ గాన్పింపలేదు. ఏమిచేయుటకుఁ దోఁప కతఁడు మఱింతవడిగాఁ బరుగెత్తి ముడలి వగర్చుచు నాఁగి సరకులగంప క్రిందఁబెట్టి బొందు తడవిచూచి నడికట్టు గట్టిగా బిగించుకొని ప్రాణరక్షణకై యెటకుఁ బోవలయునో యాలోచించుకొనుచుండెను. ముసలి తనమనసు విడువక సదా తలఁపునకు వచ్చుచుండెను. భగవత్కృపచే నామె క్షేమమును గూర్చి యతఁడంతగా నాదుర్దాపడనవసరము లేకపోయెను. ఎందుచేత? వారి కొంప యెత్తుకొంపగాక క్రిందికి వ్రాలియున్న పూరికప్పు గుడిసె. అట్టిగుడిసెలు గాలివానలకుఁ గూలిపోవని యతఁ డెఱుఁగును. అదియుఁగాక దానిచుట్టును వెదురుడొంకలున్నవి. అవి తన కుటీరమును గాలిదెబ్బ తగులకుండఁ గాపాడునని యతనికిఁ దెలియును. తన స్థితియే సందిగ్ధస్థితిగా నున్నది. నారాయణస్వామికోవెల తనకు ముందు కొన్నిగజములదూరముననే యున్నది. ఆగుడిలో దూఱి కూర్చున్నచో నెంతగాలివానయైనను తన సిగపూవు గదల్పలేదు. బహుశః పూజారి రాత్రిపూజ కింకను వచ్చియుండఁడు, గనుక, మెల్లగా తాను లోపలఁ బ్రవేశింపవచ్చును. అర్చకుఁడు వచ్చియున్నయెడల ఆసంగతి వేఱు. అతఁడు పూర్వాచార సంప్రదాయములకు సాటిగాఁ బోవు ఛాందసబ్రాహ్మణుఁడు. ఒక పక్షముక్రిందటనే అతఁడు చెఱువులో స్నానముచేసి బిందెతో నీళ్లు పట్టుకొని వచ్చుచుండఁగా రామచరణ్ ఆదారిని బోవుట తటస్థించెను. రామచరణ్ నీడ తనపైని బడినదేమో యని యతఁడు బిందెఁడు నీళ్లను నేలఁ గుమ్మరించి తిరుగఁ జెఱువునకువెళ్లి మరల మునిఁగి క్రొత్తగా బిందెఁడు మడినీళ్లు తెచ్చుకొన్నాఁడు. అతఁడు గుడికే వచ్చియున్నయెడలఁ దాఁ జచ్చుటకైన నొప్పుకొనును గాని రామచరన్నును దేవాలయములోనికి రానీఁడు. అది యటుండఁగాఁ, గోవెలలో ప్రవేశింపఁ దనకుఁ గల్గిన తలంపు రామచరన్నునకే ఘోరముగాఁ దోఁచినది. తాను గుడిచొచ్చి దేవుని మైలపఱుతు నని యెట్లు సంకల్పించుకొనఁగలఁడు? పట్టనవాసులు కొందఱు తన గ్రామమునకువచ్చి తన జాతివారు దేవాలయములలోనికి వెళ్లుట తప్పుగాదు, దానివలనఁ బాపము రాదు అని తమ్మొప్పింపఁ బ్రయత్నించినమాట వాస్తవమే. కాని వారందఱును కంటిజోళ్లను, కాలిజోళ్లను ధరించి తిరుగు నవనాగరకులు. హిందువు లెప్పుడును తాఁకఁగూడని యనేక పదార్థములు వారు పుచ్చుకొందురను వదంతికూడ నున్నది. నియమము లేర్పఱిచి శాసించుపని యట్టివారిది కాదు. అదియుఁగాక, యీవిషయము యుక్తులచే నిర్ణయింపఁదగిన విషయముకాదు. తన తండ్రియును, తాతయును, ముత్తాతయును, తత్పూర్వులును జేయఁజాలనిపని చేయుటకు రామచరన్నెట్లు సాహసింపఁగలఁడు? పట్టనమునుండి వచ్చిన పెద్దమనుష్యు లది పాపముగాదని చెప్పినారు, నిజమే! తన జాతివాఁ డెవఁడో యొకఁడు దేవునిగుడి చొచ్చి దేవతావిగ్రహము నపవిత్రము చేసి, చచ్చి, లోకాంతరమునకుఁ బోయి, మరల వచ్చి, యటఁ దనకేమి జరిగినదో చెప్పినచో — అప్పుడది పాపమో కాదో తాను తెలిసికొనఁగలఁడు! కూడదు, ప్రాణరక్షణమునకైనను తాను గుడిలోనికిఁ బోఁగూడదు! అదిసిద్ధాంతము! — పైతుఫాను ప్రపంచమును క్షోభపెట్టుచున్నట్లు ఇట్టి భావనాపరంపరారూపమైన తుఫాను లోపలఁ దనమనస్సునకు దుర్భరమైన సంక్షోభము గలిగించుచుండఁగా, నొక పెద్దకొమ్మ పెళపెళ విఱిగి గాలికిఁ గొట్టుకొనివచ్చి తాను నిలుచున్న చోటికిఁ గొన్ని యడుగుల దూరమునఁ బడెను. బ్రతుకఁదలఁచినవాఁ డటనుండి కదలిపోక తప్పదు. ఆలయమున కావల పాకశాలయున్నది. కాని, యంత పెద్దగాలిహోరులోఁ గూడ నినుపరేకులు పడినప్పుడు గలుగు ధ్వనివంటి ధ్వని తనచెవిని బడినది. అది బహుశః పాకశాల కప్పులోని ముడుత యినుపరేకులు గాలివడికి కప్పునుండి విడి యెగిరిపోయి పడిన చప్పుడు గావచ్చునని యతఁ డనుకొన్నాఁడు. ఏలాగునకైనను ప్రస్తుతపు గండము తప్పించుకొనుటకేదో యొక కొంపలోఁ జొరఁబడక తీఱదు. మెఱపుల తెఱపులతోఁ గూడిన యానిబిడాంధకారములో, రామచరణ్ గంప మరల నెత్తిపైఁ బెట్టుకొని సాధ్యమైనంత వడిగాఁ బరుగిడ నారంభించెను. దేవాలయముదగ్గఱకు రాఁగానే యొకముడుతయినుపరేకు గాలిలో నెగిరివచ్చి గట్టిగా నతని పార్శ్వమునకుఁ దగిలెను. అంతట నొక పెద్దకేకతో రామచరణ్ క్రిందఁ గూలెను — తల గుడిపసారాపైఁ బడినది. తక్కినశరీరము క్రిందఁ బడినది. గంప తిరుగఁబడినది. అందలి బియ్యము, అరఁటిపండ్లు మున్నగు సరకులు చెదరి గుడితలుపుముందఱఁ బడినవి.

౫

అర్చకుఁ డాసాయంకాలమున గుడికి మామూలుకంటె ముందుగా వచ్చినాఁడు. మఱునాఁడేదో పుణ్యదినము. విశేషముగా దేవునికిఁ బూజచేయవలయురోజు. అప్పటికిఁ గావలసినవన్నియుఁ గాలవిలంబనముగాకుండ ముందే సిద్ధముచేసిపెట్టుకొనుట కతఁ డానాఁడు

పెండలకడ వచ్చినాఁడు. తుపానుపట్టినందున గుడిలో తలదాఁచు కొనవలసివచ్చినది. కావున నతఁడు కోవెలలోనికి వెళ్లి తలుపుగడియ వేసికొని కూర్చుండెను. రామచరన్నను గొట్టి క్రిందఁబడవైచిన యినుపరేకు పెద్దధ్వనితో గుడికసారామీఁదఁ బడెను. ఆధ్వని విని పూజారి తలుపుతెఱచి పైని జూడఁగా మెఱుపుల కాంతివలన, నడుము దానిపైభాగమును దేవాలయపు వసారామీఁదను, శరీరాధో భాగము క్రిందను నుండునట్లుగాఁ బడిపోయియున్న యొక మనుష్యుఁడు కనఁబడెను. అంతట నర్చకుఁడు పైకివచ్చి వడివడిగా వచ్చుచుఁ బోవుచున్న మెఱుముల తోడ్పాటున బాగుగాఁ బరీక్షించి చూచినపిమ్మట, నామనుష్యుఁడు స్మృతితప్పిపడియున్న రామచరణ్ పట్నేయని యతనికి స్పష్టమయ్యెను. అర్చకుఁడు పడిన వానిశరీరమును పరికించి చూచుచుండఁగా, ఆసాయంకాలము విచ్చలవిడిగా విడిచిపెట్టఁబడిన నభోభూతములు చదువులబడికప్పునందలి ఇనుపరేకులు లాగి చేతి సత్తువకొలఁదిని చుట్టు నాల్గువైపులను విసరివేయుచుండెను. ఆరేకు లనేకములు వచ్చి గుడిపైఁబడి కల్పాంతకాల మేఘగర్జలవంటి భీకరధ్వనులు గావించుచుండెను. ఆయపాయస్థితిలో పూజారి కేమి చేయుటకును పాలు పోకుండెను. రామచరన్నను ఆమట్టున విడిచిపెట్టి తాను లోపలికిఁ బోవుట యతనిని జంపుటయే కావచ్చును! అతనిని లోపలికిఁ గొనిపోవుట యిఁకఁ దాను శాశ్వతముగా ఘోరనరకకూపమునఁ బడిపోవుట యగును! అట్టివిషమస్థితిలో నుండి యర్చకుఁడు "తోడిమనుష్యుని, అందులో రామచరన్నను, నేనెట్లు విడిచిపోఁగలను? పోయినచో వాఁడు మృత్యువునోటఁ బడిపోవునేమో! కొన్ని సంవత్సరముల క్రిందట నేను వాని పడవయెక్కి ప్రయాణము చేయుచుండఁగా తుపానువచ్చి పడవను ఏటిలో ముంచివేసెను. అప్పుడు పాప మీ చరన్నే యేటిలో నీఁది నన్ను గట్టిగాఁ బట్టుకొని గట్టునకుఁ జేర్చి నాకు జలసమాధిదుర్గతి పట్టకుండఁ గాపాడినాఁడు! ప్రాణదాత యగు నట్టి మహోపకారి నిట్టి మహాపాయములో విడిచి నేనెట్లు పోఁగలను?" అని వితర్కించుకొనుచు సంభ్రాంతసమ్మోహస్వాంత సంక్షోభము నొందుచుండఁగా, నొక యినుపరేకు రుయ్యిమనుచు వచ్చి తనచెవిచెంతనుండి పోయెను. తప్పిపోయినదిగాని యొక యంగుళ మది తనవైపు వచ్చినయెడల ఆదెబ్బకు క్రిందమూర్ఛితుఁడై పడి తాను దేవేంద్రలోకము చూడవలసినవాఁడే! ఎంతో ప్రసవ వేదనపడినపిదప శిశువుగలిగినట్లు, మనసు మరణబాధ పడినపిమ్మట— ప్రాణరక్షణ పాపముగాదు — అనుభావ మతని కుదయించెను. అంతట ఛాందసబ్రాహ్మణుఁడైన యా యర్చకుఁడు అస్పృశ్యుఁడగు రామచరన్నను ఎత్తి తనచేతులలోఁబెట్టుకొని మోసికొని పోయి యాలయములోపల క్రింద దింపి, తలుపు గడియవేసి, గాలిచే నారి పోయిన దీపమును మరల వెలిఁగించి, యొడలు తుడిచి, తనతుండు గుడ్డ చించి ప్రక్కలకును, ముంజేతులకును దగిలిన గాయములకు కట్లుగట్టి, వసారామీఁదఁ బడిపోయినందువలన కట్టిన బొప్పులు మాటిమాటికి నీళ్లతోఁ దడుపుచు, స్మృతితప్పిపడియున్న చండాలునికి తనబట్టతో విసరనారంభించెను. బైటగాలివాన కొమ్మలు విఱుచుచు, చెట్లు పెఱికివైచుచు, ఇండ్లు గూల్చుచు, కప్పు నెగురఁగొట్టుచు, పడవలు ముంచుచు, మనుష్యుల నీటఁ బడవైచి చంపుచు — తనసర్వసంహార కృత్యమును విశృంఖలముగా నెఱవేర్చుకొనుచుండెను. గుడిలో నర్చకుఁడు గాయపడిన కడజాతివాని కుపచారములు చేయుచుండఁగా, నతని మనసులోఁ గలిగిన గాలివాన పైగాలివాన కించుమాత్రము తీసిపోలేదు. చెప్పరాని యొకనీచభావ మతని మనసులో నాకస్మికముగాఁ బ్రవేశించినది. విస్మృతుఁడైపడియున్న రామచరన్నను పైకిఁగొనిపోయి వాని యథాపూర్వ పతనస్థానమున మరలఁ బడవేసిననేమి? అందువలన నే బాధయుఁ దనకుఁ గలుగదు. తాత్కాలిక మనోదౌర్బల్యముచేఁ దాను జేసిన యపవిత్రకృత్య మెవరికిని దెలియరాదుగదా! ఈతుచ్ఛ సంకల్పముతోఁ బెనఁగులాడి తప్పించుకొనుటకు, పాపము, బ్రాహ్మణుఁడు మరణబాధ పడినాఁడు. నారాయణవిగ్రహముమ్రోల సాఁగిలఁబడి కంట నీరు పెట్టుకొని తన యావజ్జీవ దైవసేవకుఁ బ్రతిఫల మప్పు డిమ్మని ప్రార్థించినాఁడు. "నా ప్రియదైవతము వగు నో శ్రీమన్నారాయణమూర్తీ, నిన్ను నే భక్తితోఁ బూజించుట నిజమగునెడల, నేఁడు నాకు నిజము చెప్పుము. నే జేసినది పాపమా? పాపముగాదా?" అని యర్చకుఁ డశ్రుపులేకధారగాఁ గార్చుచు "ఓ పరమేశ్వరా! నేఁజేసినది పాపమా? కాదో యసందిగ్ధమైన నీదివ్యవాక్కుతో నిపుడు నాకుఁ దెల్పుము" అని గట్టిగా పునఃప్రార్థనము గావించినాఁడు. అంతట గాఢాంధకారమయమైన యతని మనసులో అగ్నిజ్వాలామయములైన యక్షరములతో నీక్రింది భగవద్గీతాశ్లోకము ప్రస్ఫుటముగాఁ గానిపించినది.

శ్లో. విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని
శునిచైవశ్వపాకేచ పండితా స్సమదర్శినః. —గీత ౫-౧౮.


తాత్పర్యము — విద్యావినయవంతుఁడైన బ్రాహ్మణునియందును, గోవునందును, కుంజరమునందును, కుక్కయందును, కుక్కమాంసము వండుకొని తిను చండాలునందును సమమైన దృష్టిగలవారు నిజమైన తత్త్వము నెఱిఁగినవారు.

ఈశ్లోకమును, నింకను గీతలోని పెక్కుశ్లోకములను పూజారి చిరకాలమునుండి పఠించుచు కంఠస్థములు చేసికొనియే యున్నాఁడు. కాని యతని కీశ్లోకముయొక్క యర్థ మిప్పు డెఱుకపడిన ట్లింతకు ముం దెన్నఁడును ఎఱుకపడలేదు. అతనిమనసులోని మహాంధకార మంతయు విరిసిపోయినది! అతని దృష్టి నాఁటి వేఱైనది! అతఁడు నాఁటి క్రొత్తమానవుఁడైనాఁడు!

## ౬

అర్చకుఁడు తడిగుడ్డపెట్టి తలతుడుపఁ గాతడుపఁగా కొంత సేపటికి రామచరణ్ డులలీ! డులలీ!" అని తెలివితప్పియుఁ దలి యని హీనస్వరపు తొక్కుమాటలతోఁ బిలిచినాఁడు. అంత పూజారి యాశా యుక్తుఁడై యుత్సాహముతో "రామ చరణ్, నీకు కొంచెము నింపాదిగా నున్నదా?" యని యడిగెను. అర్చకుని కంఠస్వరము వినుట తోడనే రామచరణ్కు నకు స్మృతి వచ్చినది. కనువిచ్చి చూడఁగానే యెదుట నతనికి స్వామివిగ్రహ మగపడినది. నీరసస్థితికి తోడుగా భయ మొకటి పుట్టియతనిని మతింత క్షోభపెట్టినది. అంత నతఁడు "అయ్యయ్యో! నేను గుడి లోనికి రాలేదు. నే నిక్కడ నుండుట యెట్లు సంభవించి నదో నేనెఱుఁగను. పూజ్యు లగు పూజారి గారూ, నామాట నమ్మఁడు. నేను దేవాలయ ములోఁ

(ప్రవేశింపలేదు, లేదు! (ప్రవేశింపవలె ననుపాపబుద్ధియూ నాకుఁ బుట్టినదిగాని, ప్రవేశింపనే దానిని తలపెట్టి యీఁడ్చివేసికొని వడిగా బయటి ప్రసరుఁ బడగొట్టితిని. పరుగెత్తుచుండఁగా నాకు మరల యినుపకోల గాలిహోరుతోఁ గొట్టుకొనివచ్చి నాపైఁ బడినది. ఆదెబ్బకు నిలువలేక నేను (గిందఁ బడితిని. తరువాత నేమి జరిగినదో నాకుఁ దెలియదు. ఏమైననేమి? మానసికపాతకము నేఁ జేసితిని గనుక భగవంతుఁడు నాకుఁ దగు (ప్రాయశ్చిత్తము చేసినాఁడు. ఇది పరమేశ్వరుని పనియే. చేసికొనిన పాపము నకు శిక్ష యనుభవింపక తప్పదు." అని గద్గద కంఠముతో వాపోయెను.



అప్పటికి, భయంకరమైన బైటి తుపానంతయును అణఁగినది. ప్రకృతి మరలఁ బ్రశాంతమై యథాపూర్వకముగా నున్నది. అర్చకుని మనస్సు

"కన్నువిచ్చి చూడఁగానే యెదుట నతనికి స్వామివిగ్రహ మగపడినది.

కూడ నల్లే ప్రశాంతమై, ప్రసన్నమై, నిర్మలమై యున్నది. భయదుఃఖపీడితమనస్కుఁడై వికృత వివర్ణవదనుఁడైయున్న రామచరణ్ను నర్చకుఁడు తేఱిచూచి "రామచరణ్, భగవద్దర్శనమునకు నీవు అపార్థము చేసికొనినావు. దైవసంకల్పమే నిన్ను దేవాలయము కడకు నడిపించి తెచ్చినది. నీవు దానిని పాటింపక నిరసించితివి. అందుచేతనే యీదండన నీ వనుభవింపవలసివచ్చినది. భగవదుద్దేశము కంటికి గట్టినట్టు స్పష్టముగా నీకగపడినను సందేహించి శ్రమపడితివి. సంశయించుట పాపము చేయుటయే. గుడిలోనికి నిన్నుఁ దీసికొని వచ్చినవాఁడను నేనే. సందేహించుచు నేను మఱికొంతసేపున్న యెడల నీవలెనే నేనును శిక్ష నొందియుందును. నీకంటె నెక్కువ దండన ననుభవించియుందునేమో! గాలివాన నాకంటిపొర తొలఁగించివేసినది. భగవంతునియొక్క సత్యమైన చేవ్రాఁత నాకిప్పుడు స్పష్టముగా అసందిగ్ధముగాఁ గానిపించుచున్నది. కనుక నాయీమాట నమ్ముము. భగవంతుఁ డొక్కఁడే యున్నాఁడు. అతఁ డందఱవాఁడునుగాని కొందఱవాఁడుమాత్రమే కాఁడు." అని కొంకుజంకులు లేని గంభీరవాక్కులతో నుపన్యసించెను.

వైద్యుతశక్తిచే నెత్తఁబడిన బొమ్మవలె రామచరణ్ హఠాత్తుగా లేచి కూర్చుండి, యర్చకబ్రాహ్మణుని పాదరేణువు తీసి నుదుటనుంచుకొని, హర్షోచ్చస్వరముతో నిట్లు పలికెను: "భగవంతుఁ డొక్కఁడే యున్నాఁడు. అతఁ డందఱవాఁడును గాని కొందఱవాఁడు మాత్రమే కాఁడు — అని నే నిప్పుడు నమ్ముచున్నాను. ఎప్పటికిని అట్లే నమ్మికొనియుందును."

---

## ఇది ఆంధ్రత్వమా ?

